



కోతకు గురైన కమ్మర్‌పల్లి ఉప్లూర్ ప్రధాన రహదారి



పొంగిపొర్లుతున్న రామడుగు ప్రాజెక్టు

• సిరికొండ మండలం కొండూర్‌లో కోతకు గురైన వంతెన



వాన జోరు.. వరద హోరు

జిల్లాలో వర్షపాతం ఇలా..

మండలం	సెం.మీ.
ధర్పల్లి	19
ఇందల్వాయి	12.5
భీంగల్	12
ఎడపల్లి	10
మోర్తాడ్	10
బాల్కొండ	10
కమ్మర్‌పల్లి	10
వేల్పూర్	10
డొంకేశ్వర్	10
డిచ్‌పల్లి	9.4
మోస్రా	9.7
సిరికొండ	8.5
కోటగిరి	7.1
నందిపేట	6.8
రేంజల్	7.5
మెండోరా	9.2
ముప్కాల్	7.8



వాడి గ్రామంలో ఇళ్ల చుట్టూ చేరిన వరద



అలుగు పారుతున్న మంచిప్ప చెరువు



సిరికొండ మండలం తూంపల్లి, కొండాపూర్ మధ్య కోతకు గురైన రోడ్డు

- ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, భీంగల్‌లలో కుండపోత వర్షం
- తెగిన ముత్యాలమ్మ చెరువు
- వాడి, నడిమితాండా, బీరప్ప తండా గ్రామాల్లోకి వరద
- సిరికొండ మండలం కొండూర్ వద్ద తెగిన వంతెన
- మంజీరా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నీటమునిగిన పంటలు
- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్, సీపీ
- అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ అర్వింద్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- పలు ప్రాంతాలకు రైళ్లు, బస్సు సర్వీసుల నిలిపివేత
- జిల్లాలో 12,413 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో 12,413 ఎకరాల్లో పంట నష్టం..

మండలం	గ్రామాలు	ఎకరాలు
సిరికొండ	11	3530
బోధన్	8	1190
ధర్పల్లి	4	350
రేంజల్	3	655
పోతంగల్	13	1894
వర్ని	11	1772
సాలూరా	5	1255
భీంగల్	9	677
మోస్రా	5	380
చందూర్	5	560
ఇందల్వాయి	5	150

జిల్లాలో వర్షం దంచి కొట్టింది. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు తెరిపి లేకుండా కురిసింది. ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, భీంగల్ మండలాలు అతలాకుతలం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోలెవల్ వంతెనల పై నుంచి వరద ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు లిచిపోయాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరడంతో అధికారులు 39 గేట్లను ఎత్తారు. ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి వరద ప్రభావిత ప్రాంతాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య పర్యటించి సహాయక చర్యలను పరిశీలించారు.

నిజామాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షం వల్ల జిల్లా వ్యాప్తంగా చెరువులు, వాగులు, వంగలు వర్షం నీటితో నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు తెగిపోవడంతో రాకపోకలు నిలిచి పోయాయి. సిరికొండ, ధర్పల్లి, భీంగల్, ఇందల్వాయి మండలాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గోదావరి పరీవాహక ప్రాంతాలైన బోధన్ మండలం హంగర్గ, కడగావ్, నందిపేట మండలం సీహెచ్ కొండూర్, నవీపేట మండలం యంచ వద్ద మంజీరా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వర్ని, చందూర్ మధ్య వర్షం వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. కందకుర్తి వద్ద గోదావరి, సాలూరా వద్ద మంజీరా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 12,413 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 3 చెరువులు తెగిపోగా 13 చోట్ల పంచాయతీరాజ్ రోడ్లు, 29 చోట్ల ఆర్ అండ్‌బీ రోడ్లకు నష్టం జరిగింది. ఒక ఇల్లు కూలి పోగా మరో 6 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధి కారులు గుర్తించారు.

60 కరెంటు స్తంభాలు, 60 కండక్టర్లు పడిపోగా కొన్నిచోట్ల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా వరదనీటిలో చిక్కుకున్న 17 మందిని రక్షించారు. భీంగల్ మండలం బెజ్జోరా వద్ద ఆటోలో వెళ్తున్న 6గురిని జేసీబీ సహాయంతో కాపాడారు.



వాడి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే, సీపీ

పర్యటించిన రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ

ముంపునకు గురైన గ్రామాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య గురువారం పరిశీలించారు. ధర్పల్లి మండలంలో ముత్యాలచెరువు తెగిపోవడంతో వాడి, నడిమితండా, బీరప్ప తండాలు ముంపునకు గురికాగా ఆ ప్రాంతాలలో వారు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. వారి వెంట ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజావెంకటరెడ్డి ఉన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లో భారీ వర్షాలపై అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు.

ధర్పల్లి, సిరికొండలో వర్ష బీభత్సం..

ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, భీంగల్ మండలాల్లో భారీ వర్షం కురవడంతో ఆ ప్రాంతంలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. ధర్పల్లి మండలం ఒన్నాజిపేట గ్రామంలోని ముత్యాలమ్మ చెరువు తెగిపోవడంతో వాడి, నడిమితండా, బీరప్ప తాండాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. మొదటి అంతస్తు వరకు వర్షం నీరు రాగా గ్రామస్థులు ఇళ్లపైకి ఎక్కి సహాయం కోసం ఎదురు చూశారు. వరద ప్రవాహం తగ్గగానే గ్రామస్థులను ఒన్నాజిపేటలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిరికొండ మండలం కొండూరు గ్రామ వంతెన తెగిపోవడంతో పాటు తూంపల్లి, కొండాపూర్‌ల మధ్య రోడ్డు తెగిపోవడంతో

మిగతా 8వ పేజీలో...

నిలిచిన ఆర్టీసీ, రైల్వే సర్వీసులు..

భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ, రైల్వే సర్వీసులు నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్లే రైల్వే సర్వీసులను కామారెడ్డి వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా 46 సర్వీసులను రద్దు చేయగా కొన్నింటిని కరీంనగర్ నుంచి దారి మళ్లించారు. 287 బస్సులను రద్దు చేయగా హైదరాబాద్ వెళ్లే 112 బస్సులను రద్దు చేశారు. కామారెడ్డి-రామాయనంపేట్ మధ్య హైదరాబాద్ వెళ్లే మార్గంలో వరదనీరు వల్ల వాహనాలు వెళ్లే పరస్థితి లేకపోవడంతో అటువైపు వాహనాలు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోచంపాడ్, ముప్కాల్, బాల్కొండ జాతీయ రహదారిపై ట్రాఫిక్ వల్ల వాహనాలు నిలిచిపోయాయి. వర్ని, చందూర్ మధ్య వర్షభీభత్సంతో వరదనీరు ప్రవాహం వల్ల బాన్సువాడ వెళ్లే బస్సులు నిలిచిపోయాయి.

అప్రమత్తంగా ఉండాలి అపోహలను నమ్మొద్దు

- పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న 48 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అనవసరంగా ఎవరూ బయటకు రావద్దని అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలను నమ్మవద్దని తెలిపారు. విద్యుత్ తీగల వద్దకు వెళ్లరాదని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా 24గంటలు అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. పురాతన కట్టడాలు ఉన్నట్లయితే వర్షం తాకిడికి కూలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100కు, పోలీస్ కంట్రోల్ రూమ్ 87126 59700 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తెగిన సిర్నాపల్లి చెరువు

- రామ సాగర్ తండా, జీకే తండాలో గ్రామాల్లోకి వరద
- బాధిత గ్రామాలను సందర్శించిన రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి
- పొంగి పొర్లుతున్న లింగాపూర్, లోలం, ఇందల్వాయి, వాగులు



జీకే తండాలో ఇళ్లలోకి చేరిన వరద



నీట మునిగిన పంట పొలాలు


ఇందల్వాయి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అతి భారీ వర్షాల కారణంగా ఇందల్వాయి మండలంలో పలు గ్రామాల్లో చెరువులు తెగిపోగా, మరి కొన్ని గ్రామాల్లోకి వరద నీరు చేరాయి. రోడ్లపై నుంచి వరద పారడంతో రాకపోకలు స్తంభించాయి. కల్వర్టులు తెగిపోయి వరద పంట పొలాల్లోకి పోయి వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరద బాధిత గ్రామాలను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి గురువారం సందర్శించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పాటి తండ వాగు వరద ఉధృతి పెరగడంతో బ్రిడ్జిపై నుంచి వరద పొంగి ధర్పల్లి పోయే వాహనాలు పూర్తిగా నిలిచి పోయాయి. ఎల్లారెడ్డిపల్లి వద్ద రోడ్డు పైకి వర్షపు నీరు రావడంతో ట్రాక్టర్ రోడ్డుపై అడ్డంగా పెట్టారు. లోలం, మల్లాపూర్ వాగుపై వరద తీవ్రరూపం దాల్చడంతో పంట పొలాల్లోకి చేరింది. గన్నారం, ఇందల్వాయి వాగులు చెరువులు నిండి అలుగు ద్వారా రోడ్ల మీదకు నీరు చేరి రాక పోకలు నిలిచి పోయాయి. సిర్నాపల్లి రామన్న చెరువు తెగిపోవడంతో వరద గ్రామాల్లోకి చేరాయి. నల్లవెల్లి కల్వర్టు తెగిపోవడంతో వర్షపు నీరు పంట పొలాల్లోకి పోయి తీవ్ర పంట నష్టం జరిగింది. జీకే తండాలో మోహన్ నాయక్ చెరువు తెగిపోయి గ్రామాల్లోకి వరద చేరింది. డొంకల్ గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన రైతులు వరద నీటిలో చిక్కిపోవడంతో పోలీసులు, గ్రామస్థులు రక్షించారు.

వాడి, నడిమి తండాను ముంచెత్తిన వరద

ధర్పల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఒన్నాజిపేట అటవీ ప్రాంతంలోగల ముత్యాల చెరువు గురువారం ఉదయం తెగిపోవడంతో వాడి, నడిమి తండాలకు పెద్ద ఎత్తున నీరు చేరడంతో ప్రజలు బిక్కు బిక్కుమన్నారు. ఉదయం 7గంటలకే కళ్ల ముందరే వరద ముంచెత్తడంతో గ్రామస్థులు విధిలేక స్లాబ్‌ల పై చేరారు. అధికారులు గ్రామాన్ని ఖాళీ చేయించి పునరావాస కేంద్రా లకు ట్రాక్టర్ల ద్వారా తరలించారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, సీపీ సాయి చైతన్య గ్రామాన్ని సందర్శించారు. నష్టాన్ని అంచనా వేశారు. ముంపు బాధితులకు ఆశ్రయం కల్పించిన ఒన్నాజి పేట పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరా వాస కేంద్రాన్ని సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. వీరి వెంట ఆర్‌డీవో రాజేంద్ర కుమార్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, అధికారులు ఉన్నారు. మండలంలోని రామడుగు ప్రాజెక్టు ఉప్పొంగి ప్రవహిస్తోంది. 20వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కాగా అదే స్థాయిలో ఔట్ ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



తెగిన ఒన్నాజిపేట ముత్యాలమ్మ చెరువు కట్ట



కదలని రైళ్లు, బస్సులు..

- భారీ వర్షాల నేపథ్యంలో రద్దు

సుభాష్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. కామారెడ్డి వద్ద నీటి ఉధృతికి పట్టాల కింద కట్ట తెగిపోవడంతో సికింద్రాబాద్ నుంచి కామారెడ్డి నిజామాబాద్ మీదుగా వెళ్లే రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను వికారాబాద్ మీదుగా దారి మళ్లించారు. సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్, బోధన్ నడిచే రైళ్లను పూర్తిగా రద్దుచేశారు. సుమారు 46 రైళ్లలో కొన్నింటిని డైవర్షన్ చేసి మరికొన్ని రైళ్లను పూర్తిగా రద్దుచేశారు. సికింద్రాబాద్, నిజామాబాద్ మధ్య, కాచిగూడ బోధన్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. ప్రయాణికులు సమాచారం కోసం కాచిగూడ 9063318082, నిజామాబాద్ 9703296714, కామారెడ్డి 9281035664, సికింద్రాబాద్ 040-27786170 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

డిపోలకే బస్సుల పరిమితం..

నిజామాబాద్ రీజియన్ పరిధిలోని వాగులు, వంకలు పొంగి పొర్లడంతో బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. కామారెడ్డి, హైదరాబాద్ రహదారి కోతకు గురికావడంతో బుధవారం నుంచే నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులన్నీ రద్దు చేశారు. చంద్రయాన్‌పల్లి వద్ద ఉన్న వాగు కుంగిపొర్లడంతో కామారెడ్డి వెళ్లే బస్సులను సైతం రద్దు చేశారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులను రద్దు చేశారు. ఇందల్వాయి, సిరికొండ, ధర్పల్లి బస్సులను పూర్తిగా రద్దు చేశారు. రీజియన్ పరిధిలో ప్రతీరోజు 588 బస్సులు నడుస్తుండగా కేవలం 301 బస్సులు మాత్రమే గురువారం నడిచాయి. 287 బస్సులు రద్దు చేసినట్లు నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు నడిచే 112 బస్సులను రద్దు చేశారు. సాయంత్రం కేవలం 20 బస్సులను మాత్రమే హైదరాబాద్‌కు పంపారు.



'ఆమో'దే పై చేయి..

- జిల్లాలో మొత్తం ఓటర్లు 8లక్షల 51వేల 417
- మహిళా ఓటర్లు 4లక్షల 54వేల 621
- పురుష ఓటర్లు 3లక్షల 96వేల 778
- ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన అధికారులు
- 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులు

నిజామాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. ఈ జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇటీవల అధికారులు గ్రామాల వారీగా, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించగా తుది జాబితాను వెల్లడించారు. అధికారులు వెల్లడించిన తుది జాబితా ప్రకారం జిల్లాలో 8లక్షల 51వేల 417 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 4లక్షల 54వేల 621 కాగా పురుష ఓటర్లు 3లక్షల 96వేల 778 మంది ఉన్నారు. ఇతరులు 18 మంది ఉన్నారు. మొత్తం 545 గ్రామ పంచాయతీలలో 5,022 వార్డుల వారీగా, 5053 పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఈనెల 29న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయిలో సమావేశం, 30న మండల స్థాయిలో సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 28 నుంచి 30 వరకు ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వచ్చిన ఫిర్యాదులను సెప్టెంబరు 1వ తేదీ నాటికి పరిష్కరించి 2వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఐర్లాండ్‌లో మెండోరా యువకుడి మృతి

- 4 నెలల క్రితమే స్వదేశంలో వివాహం
- ఆఫీస్‌కు వెళ్లే ముందు గుండెపోటు

8

నేడు విద్యాసంస్థలకు సెలవు

నాలుగు మండలాలకు మాత్రమే

వర్ష ప్రభావిత మండలాలైన సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, భీంగల్ మండలాలలో నేడు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. కేవలం ఈ నాలుగు మండలాలలోనే సెలవు ఉంటుందని స్పష్టం చేశారు.


డొంకేశ్వర్‌లో కొలువుదీరిన సత్య (కర్ర) గణపతి


కోటగిరిలో కొలువు దీరిన గణనాథుడు


అంకాపూర్‌లో కర్ర గణపతి


బోధన్ శివాలయంలో పూజలు

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు మేమయ్య!

నందిపేట/బోధన్/నవీపేట/జక్రాన్‌పల్లి/వేల్పూర్ డొంకేశ్వర్/భీమ్‌గల్/ఎడపల్లి/రెంజల్ /ముప్కాల్/కోటగిరి, ఆర్మూర్/ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో నిర్వహిం చుకునే ముఖ్యమైన పండుగల్లో వినాయక చవితి ఒకటి. ఈ పండగను ప్రతీ యేడు భాద్రపద మాసంలో శుక్ల చతుర్థి రోజున నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే బుధవారం రాత్రి బొజ్జ గణపయ్యలు కొలువుదీరాయి. ముందుగా మహారాష్ట్రలోని నాందేడ్, తెలంగాణలోని జగిత్యాల తదితర జిల్లాల నుంచి వివిధ రకాల భంగిమలు కలిగిన వినాయక ప్రతిమలను ఒక రోజు ముందే నందిపేట మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమం, నందికేశ్వర ఆలయంకు చేర్చారు. నవరాత్రి, గణేష్ ఉత్సవాలను నిర్వహించేందకు యువకులు, పిల్లలు ఉవ్విళ్లూరుతూ విఘ్నేశ్వరులను సిద్ధం చేశారు. అందుకు మండపాల లో డెకొరేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేస్తూనే భక్తులు భక్తి, శ్రద్ధలతో పూజలు, అభిషేకాల మధ్య వినాయకులను మండపాలకు చేర్చారు. డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్‌లతో ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. బ్రాహ్మణుల మంత్రోచ్ఛర మధ్య వినాయకులను ప్రతిష్ఠించారు. అయితే ఆయ గ్రామాల్లో ప్రజలు బొజ్జ గణపయ్యలను ఇళ్ళలో నిలిపారు. ఉండ్రాళ్ల పాశం చేసుకొని ఆరగించారు. అయితే సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ యువజన సంఘాలు, కుల సంఘాలు వినాయక మండపాళ్లో గణపయ్యలను నిలిపారు. పోలీసులు డీజే సౌండ్ బాక్సులను నిషేదించడంతో డప్పు వాయిద్యాలు, సౌండ్ డప్పులు, బ్యాండు బాజేలు, మ్యూజిక్ సిస్టమ్ ద్వారా వినాయ విగ్రహలను మండపాలకు తరలించారు. గణపయ్యలు కొలు వుదీరిన తర్వాత మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బోధన్ పట్టణంలో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని యువకులు మండపాలలో ప్రతిష్ఠించే గణేష్ విగ్రహాలను డప్పువాయిద్యాలతో తీసుకెళ్లి వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రతిష్ఠించారు. పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు.ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మానుల సాయిలు, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, సీఐ వెంకట్ నారాయణ, తహసీల్దార్ విఠల్, ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.నవీపేట మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీధి వీధిన యువకులు, పిల్లలు, మండపాలను ఏర్పాటు చేసి గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. నవీపేటలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు రాకేష్ తన సొంత ఖర్చుతో 200మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి,అయ్యప్ప స్వామిఆలయపురోహితులు శశాంక్‌జోషి, యువకులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లిమండలంలోని అన్ని గ్రామాలలో గణేష్ ఉత్సవా లను మండపాల సభ్యులు, భక్తులు, ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నారు. గణేష్ ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలో ఘనంగా జరుపుకోవాలని ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్ , అధికారులు తెలిపారు. గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ మండ లం అంకాపూర్ గ్రామంలో హిందూ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్ర గణపతి బుధవారం కొలువుదీరింది. గ్రామంలోని వేముల సత్తెమ్మ లచ్చగౌడ్ ఫంక్షన్‌హాల్‌లో రోజ్‌వుడ్ కట్టె గణపతిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు పూజలు నిర్వహించిన అనంతరం మట్టి గణపతిని నిమజ్జనం చేస్తామని, కర్ర గణపతిని గ్రామంలో భద్ర పరుస్తామని హిందూ సేవా సమితి అధ్యక్షుడు సల్లచిన్న బొర్రన్న తెలిపారు. బతుకు దెరువుకోసం దుబాయికి వెళ్లిన వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన యువకులు బుధవారం వినాయక నవరాత్రి ఉత్సవాలను ఏర్పాటు చేసి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబాయిలో ఉంటున్న తాము వినాయక ఉత్సవాలను కొనసాగించడం పట్ల తామకు ఆనందంగా ఉందని వారన్నారు.వేల్పూర్ మండలం లోని వివిధ గ్రామాలలో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా భారీగా వర్షం కురుస్తుంది. మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షానికి ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. డొంకేశ్వర్ గ్రామ శివారులో సోయ పంటలు నీటి మునిగాయి. కోమటిపల్లి, నికల్పూర్ గ్రామాల మధ్య చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో తహసీల్దార్ నరేష్‌కుమార్, ఎంపీడీవో లింగం, ఆర్‌ఐ అశోక్ సింగ్ చెరువు అలుగును పరిశీలించి ఇటువైపు ఎవరూ రాకుండా రోడ్డును మూసివేశారు. జైజై గణేశా జై కొడతా గణేష్ అంటూ వినాయక చవితి వేడుకలు ప్రజలు బుధవారం భీమ్ గల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షంలో సైతం వినాయకులను భజనలు, డప్పు వాయిద్యాలు, డాన్సులతో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపించి ప్రతిష్ఠించారు. పట్నం లోని నందీగల్లీలో నందీశ్వర యూత్ ఆధ్వర్యంలో 23 ఫీట్ల భారీ వినాయక ప్రతిమను ప్రతిష్ఠించారు. పండగను పురస్కరించుకొని ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.సరస్వతి విద్యా మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో ఉచి తంగ మట్టి గణపతులను అందజేశారు. ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.రెంజల్‌లో వినాయక చవితిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని గణేష్ మండపాల వద్ద గణనాథులు కొలువుదీరారు. 11రోజుల పాటు వివిధ పూజలు అందుకుంటున్న గణనాథులు గ్రామంలో సార్వజనిక్ గణనాథుడితో పాటు గల్లీగల్లీలో గణనాథులను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రజలందరు సుఖశాంతులలోఉండాలని పూజలు నిర్వహించారు.డొంకేశ్వర్ మండలకేంద్రంలో గత ఎనిమిది సంవత్సరాలగా కట్టె(సత్య)గణపతి సర్వ సమాజ్‌కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్నారు. నిర్వహించారు.ముప్కాల్, బాల్కొండ మండలంలో బుధవారం వినా యక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. వినాయక మండపాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పొలిమేర నుంచి వినాయకులను డప్పు వాయిద్యాలతో ఘనంగా ప్రధాన వీధుల గుండా ఎదుర్కొంటూ తీసుకువచ్చి మండపాల వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం పురోహితుడు ప్రత్యేక పూజలు చేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో బుధవారం ఘనంగా గణనాధుడు కొలువుదీరాడు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో సుమారు 130 గణేష్ మండపాలలో కొలువుదీర్చారు.

లో లెవల్ వంతెన పరిశీలన


పిప్రిలో వంతెనను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆర్మూర్,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి):గత రెండు రోజులుగా భారీవర్షాలు కురుస్తునందున ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామా లలె లోలేవల్ వంతెనలను గురువారం ఎంపీ డీవో శివాజీ పరిశీలించారు.మంథని, దేగాం గ్రామాల మధ్యగల వంతెన, పిప్రి మగ్గిడి గ్రామాలలోని లోలేవల్ వంతెనలను, చేపూర్ శివారులో జాతీయ రహదారులను ఎంపీడీవో పరిశీలించారు.గ్రామాలలో పరిస్థితి ప్రశాంతం గా ఉందని వర్షాల వల్ల రోడ్లు కోతకు గుర వ్వడం, రోడ్లు ధ్వంసం కావడం లాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని ఆయన తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మురళి కాంత్ ఉన్నారు.

కొటార్మూర్‌లో మట్టి గణపతుల పంపిణీ


మట్టి విగ్రహాలను అందజేస్తున్న యూత్ సభ్యులు

ఆర్మూర్,ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో దేవి యూత్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుమారు 700 మట్టి విగ్రహాలను తయారు చేయించి గ్రామస్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పసుపుల రఘునాథ్, బండరి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గుండెం స్వామి, ప్రధాన కార్యదర్శి రాస దయాకర్, కోశాధికారి రవికుమార్, లక్ష్మీనారాయణ, రాము, రమేష్, శ్రీకాంత్‌గౌడ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పరిశీలన..


రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్

ఆర్మూర్ టౌన్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ప్రధాన రోడ్లను మున్సిపల్ కమీషనర్ రాజు, ఎస్‌హెచ్‌వో సత్యానారాయణ పరిశీలించారు. ప్రధాన రోడ్లలో గల డ్రైనేజీలను మున్సిపల్ సిబ్బందితో, జేసీబీ సహాయంతో చెత్తను తొలగింపజేసి నీరు నిల్వకుండా జాగ్రత్తలు చేపట్టారు. అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు వెళ్లవద్దని ఈ సందర్భంగా వారు తెలిపారు.వారి వెంట అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శంగా సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి


మట్టి గణపతికి పూజలు చేస్తున్న సర్వసమాజ్

ఆర్మూర్ టౌన్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్ళుగా మట్టి గణపతి ప్రతిష్ఠాపనతో అందరికి సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి ఆదర్శంగా నిలుస్తుందని సర్వసమాజ్ అధ్యక్ష కార్యదర్శులు కొట్టాల సుమన్, కర్తన్ దినేష్‌లు తెలి పారు. బుధవారం మానిక్ భవన్ మందిరంలో మట్టి గణపతిని ప్రతిష్ఠాపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 రోజులు పూజల అనంతరం వినాయక నిమజ్జనం ఉంటుందని వారు తెలిపారు.

వేముల సురేందర్‌రెడ్డికి నివాళి


నివాళులు అర్పిస్తున్న నాయకులు

వేల్పూర్ , ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడిగా రైతుల కోసం పోరాటాలు చేసిన స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి బుధవారం 9వ వర్ధంతి వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న వేముల సురేందర్‌రెడ్డి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లింగమయ్య జాతర

కోటగిరి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): లింగాపూర్ గ్రామ శివారులో అడ్కాస్ లింగమయ్య జాతర గురువారం కొనసాగింది. శ్రావణ మాసం ముగింపును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు లింగమయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రావణ మాసానికి ముగింపు పలకారు. భారీ వర్షాల నేపథ్యంలో జాతర అంతంత మాత్రంగానే కొనసాగింది.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వేగేట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గంగాధర్ తన బైక్‌పై మల్కాపూర్(ఏ) నుంచి నవీపేట వైపు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులుపేర్కొన్నారు. వెంటనే బాధితుడిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు.ఈవిషయంపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

సుభాష్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):నగరంలోని వర్నిచౌరస్తా వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వర్ని చౌరస్తా వైపు కాలినడకన వెళ్తున్న బోయిగల్లికి చెందిన కిషన్‌ను వెనుక నుంచి డీసీఎం వ్యాన్ వచ్చి ఢీకొట్టడంతో కిషన్ అక్కడి కక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో 5వ టౌన్ ఎస్సై గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీసీఎం వ్యాన్ ఢీకొని పారిపోతుండగా స్థానికులు 5వ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కిషన్‌కు భార్య, కొడుకు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కోటగిరి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం గ్రామానికి చెందిన నేనావత్ రాందాస్(23)అనే వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. రాందాస్ మద్యానికి బానిసై ఇంట్లో తరుచు గొడవ పడేవాడని ఎస్సై తెలిపారు. తండ్రి మందలించడంతో బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

రెంజల్,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన ఇరుగందుల శివ అనే యువకుడు అదృశ్యం అయినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సాటాపూర్ గ్రామానికి చెందిన ఇరుగందుల శివ బోధన్‌లోని గర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుండి కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన శివ రాత్రి వరకు ఇంటికి రాలేకపోవడంతో బంధుమిత్రులతో పాటు చుట్టు పక్కల ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో బాధితుడు సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ముప్కాల్ , ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో గురువారం పిచ్చికుక్క దాడిచేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. అంతేకాకుండా ఏడు గేదే దూడలను సైతం పిచ్చికుక్క గాయపరిచింది. పిచ్చికుక్క కాటుకుగురైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా ఒకరి మృతి

సదాశివనగర్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచారం వద్ద ఆటోబోల్తా పడి దేవుల్వాడి ఏసప్ప(56) మృతిచెంది నట్లు ఎస్సై పుష్పరాజ్ గురువారం తెలి పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దగ్గి గ్రామానికి చెందిన ఏసప్ప తన సొంత ఆటోలో ప్రయాణీకులను ఎక్కించుకుని యాచారం వద్ద ప్రయాణీకులను దింపిఐం టరిగా తిరిగివస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆటోబొల్తాపడి అతడిపైన పడగా తలపగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరు కుని పరిశీలించగా దారిలో కొద్దిగా గుంతలు, ఎత్తుపల్లాలు ఉండటం, వర్షం కురుస్తుండటం తో వాహనం నడుపుతున్న ఆయన గమనించకపోవడం వల్ల ఆటో అదుపు తప్పి బోల్తా పడినట్లు తెలిపారు. ఈమేరకు కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఖమ్మం కంట్రోల్ రూం అప్రమత్తతతో..

తొమ్మిది మంది సేఫ్..

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం యాదారం గ్రామంలో బుధవారం చెరువుకు వరదపోటెత్తింది.. ఒక్కసారిగా నీళ్ల చుట్టుముట్టడంతో అక్కడి గ్రామస్థులు వరదలో ఇరుక్కుపోయారు. కాపాడాలంటూ 9502363435 నెంబర్ నుంచి ఖమ్మం కలెక్టరేట్ కంట్రోల్ రూంకి కాల్ వెళ్లింది. అక్కడి సిబ్బంది స్పందించి వెంటనే కామారెడ్డి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో కామారెడ్డి పోలీసులు, అధికారులు హుటాహుటిన సదరు ప్రదేశానికి వెళ్లారు. అక్కడి ఎన్‌హెచ్ 44పై పొక్లెయిన్లతో రోడ్డుకు అడ్డం వేసి వరదనీటిని నిలిపివేయగలిగారు. ఆ తర్వాత యదాదారం గ్రామానికి ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ బృందాలు చేరుకున్నాయి... సాయంత్రం వరకు వరదలో చిక్కుకున్న తొమ్మిది మందిని బృందాలు కాపాడాయి.


కామారెడ్డి జిల్లా యాదారం గ్రామంలో ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ బృందం కాపాడిన గ్రామస్థులు వీరే..

భారీ వర్షాలకు స్తంభించిన జన జీవనం

బోధన్/సాలూర/ముప్కాల్/జక్రాన్‌పల్లి/రెంజల్/వేల్పూర్/మోస్రా ,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జన జీవనం స్తంభించిది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. జన జీవనం అతలకుతలమైంది. వర్షపు ప్రభావిత ప్రాంతాలలో అధికారులు పర్యటించారు. సాలూర శివారులోని మంజీర కొత్త బ్రిడ్జికి తగిలి మంజీర ఉగ్రరూపం దాలుస్తూ ప్రవహించింది. హంగర్గ గ్రామ శివారులో భారీగా వర్షం నీరు చేరడంతో ప్రజలను సబ్‌కలెక్టర్, తహసీల్దార్ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ హంగర్గ గ్రామ సమీపంలోకి చేరడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ముందస్తు జాగ్రత్తగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో హంగర్గ గ్రామస్థులను తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఎస్సారెస్పీ గేట్లు లేపి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. బికెనెల్లిలో ఓ కుటుంబాన్ని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. శిథిలావస్థ ఇంటిలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. బోధన్ పట్టణంలో 10మందిని పునరావాస కేంద్రాలకు చేర్పించి భోజన వసతులు కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. పట్టణంలోని చావిడి, శక్కర్‌నగర్‌లోని బెగ్గర్ హస్టల్, రాకాసిపేటలోని వసతి గృహలలో సుమారు 10మందికి పైగా చేర్పించి వారికి వసతులు కల్పిస్తున్నామన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి మంజీర భారీగా ప్రవహిస్తుండడంతో తెలంగాణ సమీపంలో ఉన్న ఖండ్‌గావ్ బ్రిడ్జి మహారాష్ట్రలోని కొండల్ వాడి గ్రామానికి వంతెన తగిలిఉంటుంది. ఈ బ్రిడ్జి పైనుండి భారీగా మంజీర నది ప్రవహించడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో తెలంగాణ, మహారాష్ట్రకు రాకపోకలు నిలిపివేసినట్లు అయింది. భారీ వర్షాలకు ఖండ్‌గావ్ వద్ద ఉన్న బ్రిడ్జి మధ్య భాగంలో రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సాలూర, బోధన్ తహసీల్దార్ విఠల్, శశిభూషన్‌లు పర్యటిస్తున్నారు. బోధన్ రెవెన్యూ, మున్సిపాలిటి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. ఎటు వెళ్లాలన్న ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మున్సిపల్ యంత్రాంగం జలమయమైన కాలనీల్లో పర్యటించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో నియోజకవర్గంలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని అన్నారు.బెల్లాల్‌లోని అలుగు పారి నిండు కుండలా మారింది. ముప్కాల్‌లో బుధవారం నుంచి ఎడతెరుపు లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ముప్కాల్, బాల్కొండ మండ లాలలో వాగులు, చెరువులు మత్తడిలు పారుతున్నాయి. నిలిపివేసిన లారీ డ్రైవర్లు, క్లీనర్‌లకు మండల అధికారులు, పోలీస్‌లు వారికి ఆహారాన్ని, తాగునీటిని అందిస్తు న్నారు.జక్రాన్‌పల్లి మండలంలో 53.0 ఎంఎం వర్షపాతం నమోదైన ట్లు తహసీల్దార్, అధికారులు తెలిపారు. కలిగోట్, చింత లూర్ వాగు బ్రిడ్జి పై నుంచి వరద నీరు ఉధృతంగా పారుతుంది.రెంజల్‌లో భారీ వర్షాల వల్ల పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. మంగళవారం, బుధవారం కురిసిన వర్షాలకు నీలా, కందకుర్తి, తాడ్‌బిలోలి గ్రామాలలో వరి, సోయాపంటలు పూర్తిగా నీట మునగాయి. పచ్చల నడ్కుడ, జాన్కం పేట్ , వేల్పూర్ శివారులో ఉన్న చెక్ డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. మోతె గ్రామ సమీపంలో కప్పలవాగు వరద నీరు హైలేవల్ బ్రిడ్జి పై నుంచి పారింది. దీంతో మోతె భీమ్‌గల్ ప్రధాన రహదారి పై సుమారు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపో యాయి.వేల్పూర్ పెద్దవా గులో మోతెవద్ద కప్పల వాగులో ప్రవహిస్తున్న నీటి ఉధృతిని గురువారం మధ్యాహ్నం డిప్యూటి కమిష నర్ ఆఫ్ పోలీస్ బస్వరెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్,స్థానికఎస్సైలతో ఎంపీడీవో, డీటిలు పరిశీలిం చారు.

జలదిగ్బంధంలో హంగర్గ గ్రామం

బోధన్ మండలం హంగర్గ గ్రామంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ పెరగడంతో హంగర్గ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుపోయింది. శ్రీరాంసాగర్‌కు ఎగువ నుంచి వచ్చే వరద నీరు భారీగా వచ్చి చేరడం వలన వరద గేట్లను తెరిచి దిగువకు వదిలారు. దాంతో బ్యాక్ వాటర్ హంగర్గ గ్రామ సమీపంలో ఉన్నటువంటి వాగుకు భారీగా వరద ఉధృతి పెరగడంతో బ్యాక్ వాటర్ గ్రామంలోకి వచ్చి చేరాయి. సబ్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్, పోలీసు సిబ్బంది అప్రమత్తమై ముందస్తుగానే కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హంగర్గ గ్రామానికి రెవెన్యూ,పోలీసులతో పాటు గజ ఈతగాళ్ళ, ప్రజలను సంరక్షించే రిస్క్ టీంలను సైతం అందుబాటులో ఉంచారు.


ఖండ్‌గావ్ బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వరద


వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీసీపీ బస్వరెడ్డి


లారీ డ్రైవర్లకు ఆహారం అందిస్తున్న పోలీసులు


జలదిగ్బంధంలో హంగర్గ గ్రామం

బోధన్‌లో మరో రేసింగ్ పావురం

- కాలికి కోడ్ అక్షరాల రింగ్
- పోలీసుల గూటికి చేరిన పావురం


పావురం కాలికి రేసింగ్ కోడ్ ఉన్న దృశ్యం

బోధన్,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లయన్స్ క్లబ్ చౌరస్తా ఉన్న ఉన్న అపార్ట్‌మెంట్ వద్ద గురువారం సాయంత్రం ఓ పావురం లభించింది. స్థానికులకు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పావురం యొక్క కాలికి కోడ్ రింగ్ ఉండడంతో గూఢచారి పావురమా, రేసింగ్ పావురమా అని బోధన్‌లో చర్చానీయాంశమైంది. 10రోజుల క్రితం బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామంలో ఇలాంటి పావురం కనిపించడంతో కలకలం రేపింది. పావురం రెక్కలపైన కోడ్ లేటర్స్ ఉండడంతో పాటు పావురం కాళ్లకు రింగ్ కోడ్‌లు ఉండడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ ఇది రేసింగ్ పావురంగా గుర్తించినట్లు తెలిపారు. కాళ్లకు ఉన్న కోడ్ ఆధారంగా రేసింగ్ పావురంగా గుర్తించామన్నారు. విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు. పది రోజుల క్రితం భవానీపేట్ గ్రామంలో ఇలాంటి పావురమే కనిపించడం మళ్లీ రేసింగ్ పావురం కనిపించడం పలు అనుమానాలకు తావిస్తుంది. బెంగుళూరు, చైనా తదితర ప్రాంతాలలో రేసింగ్ పావురాలు ఆట నిర్వహిస్తారు. లైసెన్స్‌తో కూడిన పావురాల ఆట నిర్వహించడం అక్కడ ఆనవాయితీ.. కాని అలాంటి పావురాలు ఈ ప్రాంతానికి ఎందుకు కోసం వస్తున్నాయి.. పది రోజుల క్రితం భవానీపేట్‌లో గురువారం బోధన్‌లో ఇలా దొరకడం పలు చర్చానీయ అంశాలకు దారి తీస్తుంది. ఇది గూఢచార పక్షలా, రేసింగ్ పావురాలా, బోధన్‌కు ఎందుకు వస్తున్నాయని పలు అంశాలు చర్చానీయాంశమయ్యాయి. ఏదీ ఏమైనప్పటికీ పోలీసులు వీటిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని సీఐ వెల్లడించారు.


వరద ఉధృతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వరుణుడి ఉగ్రరూపం

- ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పల వాగు
- ఎక్సైజ్ కార్యాలయంలో చిక్కుకున్న ఇద్దరు సిబ్బంది
- వరద ఉధృతిని పరిశీలించిన ఆర్మూర్ సబ్ కలెక్టర్

భీమ్‌గల్,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి):గత రెండురోజు లుగా కురుస్తున్న భారీ వర్షాలతో భీమ్‌గల్ పట్టణంలోని కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది.గత 30సంవత్సరాల నుంచి భారీస్థాయిలో కురియన వర్షాలు ఈరెండు రోజులలో కురియడంతో వాగు పక్కనే గల తహ సీల్దార్, ఎక్సైజ్ కార్యాలయాలు నీటి మునిగాయి. ఎక్సైజ్ కార్యాల యంలో ఇద్దరు సిబ్బంది చిక్కుకోగా తాహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్,సీఐ సత్యనారాయణ గౌడ్, ఎస్సై సందీప్ పర్యవేక్షణలో గజఈతగాళ్లతో సురక్షితంగా బయటకు చేర్చారు. కప్పలవాగు ఉధృతి పెరగడంతో వం తెనకు ఆనుకుని ఉన్న రోడ్డు బుంగపడి ప్రమాద స్థితికి చేరుకుంది. దీంతో పోలీస్‌శాఖ భీమ్‌గల్ బడాభీమ్‌గల్ మధ్యన రాకపోకలను నిలిపివేశారు.పంట పొలాలన్ని నీట మునిగాయి.ఇసుక దిబ్బంలు పట్టడం తో రైతులు ఆం దోళన చెందుతున్నారు.పట్టణకేంద్రంలోని న్యూబస్టాండ్ వెనకు కాలనీ, తొమ్మిదోవార్డులలో గృహలలోకి వర్షపు నీరు చేరింది.


ప్రమాదకరంగా ఏర్పడ్డ బుంగ

● అధికారులు అందుబాటులో ఉండాలి : సబ్ కలెక్టర్

రెండు రోజుల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వరదల ఉధృతుల పపెరుగుతున్నందున అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అందించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అబిగ్యాన్ మాల్వియా సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని కప్పల వాగు ఉధృతిని పరిశీలించారు. వరదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను రైతులను అప్రమత్తంగా చేయాలని సూచించారు. ఈయన వెంట తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్, సీఐ సత్యనారాయణ గౌడ్, ఎస్ఐ సందీప్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఆయా శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

కోటగిరి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): కోటగిరి, పోతంగల్ మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు గురువారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరాల్సి ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో బాన్సువాడలో చేరికల కార్యక్రమాన్ని చేపట్టారు. ఉమ్మడి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలు మరింత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. మాజపీ ఎమ్మెల్యే బాజిరెడ్డి సమక్షంలో చేరిన వారిలో కోటగిరి మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రావు, యూత్ నాయకులు తెల్ల రవి, సొసైటీ ఉపాధ్యక్షులు గజేందర్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.


బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

లోతట్టు జలమయం

- కమ్మర్‌పల్లిలో 112.2 మిల్లి మీటర్లు
- కోతకు గురైన కమ్మర్‌పల్లి- ఉప్లూర్ రహదారి
- కేజీబీవీ, పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు
- వర్షపు నీటిని తొలగించిన పంచాయతీ సిబ్బంది

కమ్మర్‌పల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) రెండు రోజులుగా కమ్మర్‌పల్లి మండలంలో 112.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి మండలకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఆవరణలో, పాఠశాల బయట భారీగా వరద నీరు చేరడంతో సందర్శించి పరిశీలించిన ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ జి.ప్రసాద్ పంచాయితి కార్యదర్శి గంగజమున, పంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో వర్షపు నీరు నిలువుండకుండా చర్యలు చేపట్టారు. కాగా గ్రామంలోని పలు కాలనీల్లో మూసుకుపోయిన కాలువల ను శుభ్రం చేయించారు. కాలువల్లో పేరుకుపోయి చెత్తా చెదారాన్ని తొలగింపజేశారు. కాగా రెండు రోజుల పాటు కురిసిన వర్షలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిచింది. కమ్మర్ పల్లి నుంచి ఉప్లూర్ వెల్లే ప్రధాన రమదారి కల్వర్ట్ వద్ద కోతకు గురి కాగా ప్రమాదాలు జరుగకుండా భారికేడ్లతో పాటు తాళ్లను కట్టి నివారణ చర్యలు చేపట్టారు.


కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం వద్ద నిలిచిన వర్షపు నీరు

పొంగిపొర్లుతున్న వాగులు

మోర్తాడ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మోర్తాడ్‌లో మొండివాగు నిండుగా ప్రవహిస్తున్నది. గాండ్లపేట్ శివారులోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద కాలువ అక్విడక్ట్ కు దగ్గరగా ఆనుకుని ప్రవహిస్తున్నాయి. అంతే కాక రైల్వే బ్రిడ్జి పిల్లర్లు కూడా మునిగిపోయేలాగా పెద్దవాగు ప్రవహిస్తుంది. దీంతో పెద్దవాగు శివారులోని పంట పొలాలు పూ ర్తిగా మునిగి పోయాయి. పలు గ్రామాలకు చెందిన వాగులు భారీ వర్షాలకు పొంగిపొర్లి ప్రవహిస్తున్నాయి. గురువారం 108.2 వర్షపాతం నమోదైంది. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు గ్రామాలను సందర్శించారు.

ఉగ్రరూపం దాల్చిన గోదావరి


బ్రిడ్జిపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి

- బ్రిడ్జిపై నుంచి పొంగి ప్రవహిస్తున్న గోదావరి

రెంజల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కందకుర్తి గోదారమ్మ ఉగ్రరూపం దాల్చింది. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు త్రివేణి సంగమ క్షేత్రం కొత్త కళను సంతరించుకుంది. స్థానికంగా కురవడమే కాక ఎగువ ప్రాంతమైన విష్ణుపురి, బాబ్లీ ప్రాజెక్టుల నుంచి వరద నీరు ఎక్కువగా రావడంతో కందకుర్తి గోదారమ్మ ఉప్పొంగి ప్రవహించి పరవళ్లు తొక్కుతుంది. గతంలో కంటే వర్షం ఎక్కువగా కురడంతో కందకుర్తి బ్రిడ్జిపై నుంచి నీరు అధికంగా ప్రవహిస్తుంది. గోదావరిలోని శివాలయంతో పాటు సీతారాం త్యాగి ఆశ్రమంలోకి నీరు చేరింది. పుష్కర ఘాట్‌లు పూర్తిగా నీట మునిగిపోయాయి. బ్రిడ్జిపై వంతెన పైకి అధిక నీరు రావడంతో ప్రవహం కొనసాగుతుంది. గోదావరి పరివాహక ప్రాంతం పూర్తిగా జలమయమైపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు భారీకేడ్లను ఏర్పాటు చేశారు. మహరాష్ట్ర వైపు వెళ్లే వాహనదారులు బాసర మీదుగా వెళ్లాలని బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో లేని విధంగా గోదావరి ఉగ్రరూపం దాల్చి కందకుర్తి గ్రామం దగ్గర వైపుగా నీరుచేరడంతో తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటు వైపుగా మహారాష్ట్ర పోలీసులు, ఇటు వైపు తెలంగాణ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు.


సీతారాం త్యాగి ఆశ్రమంలోని వారిని రక్షించిన యంత్రాంగం

● నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సబ్ కలెక్టర్ వికాస్ మహతో

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కందకుర్తి గోదావరి పొంగి ప్రవహించడంతో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌తో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. గోదావరి నది ఉప్పొంగి ప్రవహించడంతో మత్స్యకారులు, జాలర్లు, పశువుల కాపర్లు ఇటు వైపులా రాకూడదన్నారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు నీట మట్టం తగ్గేంత వరకు రాకూడదని సూచించారు.


కందకుర్తిలో వివరాలు తెలుసుకుంటున్న బోధన్ సబ్ కలెక్టర్

భారీ వర్షంతో దోమకొండ, బీబీపేట అతలాకుతలం


బీబీపేటలో పెద్ద చెరువు బుంగ పనులను పరిశీలిస్తున్న అధికారులు

దోమకొండ, (బీబీపేట) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):దోమకొండ, బీబీపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతేరిపి లేకుండా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 10 గంటల పాటు భారీ వర్షం కురియడంతో పెద్ద ఎత్తున ఉధృతంగా ఎడ్ల కట్ట వాగు పారింది. దోమకొండ మండల కేంద్రంలో పలుగడ్డ, పెద్దబజార్, అంగడి బజార్, కుమ్మరి గల్లీ, ఊరడమ్మ కాలనీల్లో పెద్ద ఎత్తున రోడ్లపై వరద నీరు పారి ఇండ్లలోకి చేరింది.గొట్టిముక్కుల, లింగుపల్లి, సంగమేశ్వర్, మాందాపూర్, బీబీపేట వరకు వాగు ప్రవహం గంట గంటకు పెరగడంతో రోడ్లపై నుంచి పారింది. దీంతో అఅధికారులు దోమకొండ-గొట్టిముక్కుల, సంగమేశ్వర్- దోమకొండ, బీబీపేట- దోమకొండ, మాందాపూర్- జనగామ, గ్రామాలకు ముందుగానే రోడ్లు మూసివేశారు. సంగమేశ్వర్ గ్రామ శివారులో రోడ్డుపై వెళ్లే వరద ప్రవహానికి కారుతో పాటు ఇద్దరు వ్యక్తులు చిక్కుకున్నారు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రవంతి తన సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని సంగమేశ్వర్ నుంచి జేసీబీని తెప్పించి సహయక చర్యలు ప్రారంభించారు. జేసీబీ వరదలో చిక్కుకున్న వ్యక్తుల వద్దకు చేరుకునే సమయంలో ప్రవహం ఎక్కువై ఇద్దరు వ్యక్తులతో పాటు కారు కొట్టుకుపోయింది. అనంతరం అక్కడేమరో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా బైక్‌లతో పాటు వరదలో కొట్టుకుపోయారు. సాయంత్రం 7 గంటలకు కారుతో కొట్టుకుపోయిన వ్యక్తులు సబ్‌స్టేషన్ వైపుగా వస్తుండటంతో గ్రామస్థులు గమనించి వివరాలు అడగటంతో కారుతో పాటు వెళ్లి వరదలో ఒక చోట సపోర్టుగా పట్టుకోవడం జరిగిందని వరద తగ్గే వరకు సుమారు 9 గంటల పాటు అక్కడే ఉండి వచ్చినట్లు తెలిపారు. వెంటనే తహసీల్దార్ సుధాకర్ గ్రామానికి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు. వారిద్దరు దోమకొండకు చెందిన ఆర్ఎంపీ హరి శంకర్ అతని కుమారుడు మహేష్‌గా గుర్తించారు. అదేచోట మరో ఇద్దరు గల్లంతు అయిన వారిలో ఒకరు మాందాపూర్ కాగా అతను క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నాడు. మరొకరు సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గోత్రాల బాల్‌రాజు అచూకి లభించలేదు.

వరదకు వరిపంట నష్టం

దోమకొండ, బీబీపేట మండలాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి చాలా ఎకరాలలో వరిపంటతో పాటు ఇతర పంటలు కొట్టుకుపోయాయి.వ్యవసాయభూముల్లో నుంచి వాగులు పారడంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.రైతుల పంటల వివరాలను వ్యవసాయాశాఖ అధికారులతో సర్వే నిర్వహించి నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరారు.


పోతంగల్ మంజీర నదిలో వరద ఉధృతి


పోతంగల్ నది అవతల నీట మునిగిన పంట పొలాలు


నీట మునిగిన బోరు మోటారు


మంజీర బ్రిడ్జి వద్ద రాకపోకలను నిలిపివేస్తున్న దృశ్యం

మంజీర నదికి పోటెత్తిన వరద

- సుంకిని సమీపంలోకి చేరుకున్న వరదతో ఆందోళనలో గ్రామస్థులు
- వేలాది ఎకరాల నీట మునిగిన పంటలు
- వరద ప్రాంతాల్లో పర్యటించిన సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

కోటగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. కోటగిరి మండలంలో 70.8మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు కాగా పోతంగల్ మండలంలో 52.6మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి మంజీర నదికి వరద పోటెత్తింది. పోతంగల్ మంజీర నదికి వరద ఉధృతి పెరగడంతో నది పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. హంగర్గ, కారేగాం, కారేగాం, సుకిని, హున్స, సోంపూర్, కొల్లూర్, దోమలెడ్గిలో లెవెల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోతంగల్ మంజీర బ్రిడ్జి వద్ద అంతకంతకు వరద ఉధృతి పెరగడంతో రాకపోకలను నిలిపివేశారు. సుంకిని గ్రామానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. సుంకిని గ్రామానికి సమీపంలోకి వరద నీరు రావడంతో గ్రామస్థులను అప్రమత్తం చేశారు. నదికి సమీపంలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించారు. మంజీర నది పొంగిపొర్లడంతో సుంకిని గ్రామానికి ఏమైన ప్రమాదం ఉందా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి కొనసాగితే సుంకిని గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అన్ని రకాల చర్యలు చేపడతామన్నారు. మంజీర నది గ్రామ సమీపంలోని హనుమాన్ మందిరాన్ని తాకుతూ ప్రవాహంతో గ్రామస్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఆరు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. మాజీ డీ సీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిని సుంకిని, పొతంగల్ గ్రామాలలో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. వరద ప్రవాహం తగ్గే వరకు సుంకినితో పాటు తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి అలుగులు పొంగి ప్రవహించాయి. వేలాది ఎకరాలలో పంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోతంగల్ మంజీర నది అవతలి భాగంలో ఉన్న పంట పొలాలు వరద ముంపుకు గురయ్యాయి. అరటి తోట, సోయా, వరి పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోతంగల్‌లో డ్రోన్ సహాయంతో వరద ఉధృతిని రుద్రూర్ సీఐ కృష్ణ పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో మంజీర నది వరద ప్రవాహనాన్ని రుద్రూరు సీఐ కృష్ణ ఆధ్వర్యంలో డ్రోన్‌లతో వీడియా తీయించారు. మంజీర పరివాహక ప్రాంతాలలో వరద నీరు ఎక్కువ ఉండడంతో పశువుల కాపర్లు, రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. వరద ప్రాంతాల్లో తహసీల్దార్ గంగాధర్, నాయకులు ఏజాజ్ ఖాన్, హెగ్డోలి శంకర్, మాధవరావు, శివరాజ్ పటేల్, జుబేర్, హన్మంత్ రావు తదితరులున్నారు.

స్తంభించిన జనజీవనం



ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిలిచిన మురుగు నీరు

ఎడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు మండలంలో జనజీవనం స్థంభించి ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. భారీ వర్షం కారణంగా రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆయా గ్రామాలను పూర్తిగా పరిశీలించి మండలంలో నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు, ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. భారీ వర్షానికి ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణ పూర్తి గా వర్షపు, గ్రామంలోని మురికి నీటితో నిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెల్లలేని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులో గల అలీసాగర్ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి అధికంగా వరద నీరు రావడంతో గురువారం సాయంత్రం ఇరి గేషన్ అధికారులు రిజర్వాయర్ మూడు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు వదిలారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్ ప్రాంతాల్లో బుధవారం నుంచి కురుస్తున్న వర్షానికి నీరు నిలిచి వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, సిక్కుల కాలనీ, పెద్దబజార్‌తో పాటు మామిడిపల్లి, పెర్కిట్‌లలో వర్షపునీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వర్షపు నీరును ఇంట్లో నుంచి ఎత్తిపోసారు. కొందరి ఇండ్లలో నిత్యవసర వస్తువులు తడవడంతో నష్టం ఏర్పడింది.

తృటిలో తప్పిన ప్రమాదం ..

పట్టణంలోని కమలానెహ్రూ కాలనీలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పెద్ద బండరాయి జారీ సంజీవ్ అనే ఇంటిని ఢీకొట్టింది. దీంతో ఇంటి గోడ తలుపు విరిగిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. తృటిలో ప్రమాదం తప్పిందని సంజీవ్ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నాడు.


మామిడిపల్లిలో ఇంటిలో చేరిన నీటిని తొలగిస్తున్న దృశ్యం

పోచారం ప్రాజెక్టు వద్ద ముమ్మరంగా జరుగుతున్న పూడ్చివేత పనులు

- ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు ప్రారంభం
- అధికారుల సమక్షంలో జరుగుతున్న పనులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పో చారం ప్రాజెక్టులోకి వచ్చిన ఉధృత వరద తాకిడి కారణంగా ప్రాజెక్టు గేట్లు వద్ద మట్టికోతకు గురికాగా, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు గురువారం అధికారులు పూడ్చివేత పనులను ముమ్మరం గా జరుపుతున్నారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్టు గే ట్ల వద్ద మట్టి కోతకు గురై, మట్టి కొట్టుకపోవడంతో గుంతలా ఏర్పడింది. మట్టి కోతకు గురైనప్పటికీ ప్రాజెక్టుకు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదు. అయితే మట్టి కోతకు గురై గుంతల ఏర్పడగా దీనిని పూడ్చేందుకు వెంటనే చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎ ల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస రావు, సీఐ రాజా రెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రావు, మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. ట్రాక్టర్ల ద్వారా, టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకొస్తూ జేసీబీల సహాయంతో కోత ఏర్పడిన ప్రాంతాన్ని పూడిచి వేస్తున్నారు. ఎల్లారెడ్డి ఆర్డీవో, డీఎస్పీ, సీఐ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు మట్టిని సంచుల్లో నింపి సహాయ పడుతున్నారు. ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం జరగకుండా వెంటనే మరమ్మత్తు చర్యలు చేపట్టారు. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూడ్చివేత పనుల్లో ఎస్సై భార్గవ్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ గౌడ్, రాంచంద్రారెడ్డి ,వాసు రెడ్డి,మురళి గౌడ్, శివకుమార్, సురేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


పోచారం ప్రాజెక్టు వద్ద జేసీబీలతో మట్టి వేస్తూ పూడుస్తున్న దృశ్యం


యంచలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

జలదిగ్బంధంలో అల్జాపూర్

- భారీ వర్షాలకు అల్జాపూర్‌లో నీట మునిగిన వరిపంట
- నందిగామ, బినోల మధ్య నిలిచిపోయిన రాకపోకలు

నవీపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని యంచ పంచాయతీ పరిధిలో అల్జాపూర్ శివారులో పెద్ద ఎత్తున వరిపంట నీట మునిగింది. స్థానికంగా గోదావరి నీటి మట్టం గురువారం సాయంత్రం వరకు క్రమక్రమంగా పెరగడంతో గ్రామ శివారులో వరిపంట నీట మునిగింది. యంచ, అల్జాపూర్ గ్రా మాల మధ్యన రహదారి పైనుండి గోదావరి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం సాయంత్రం నుంచి అల్జాపూర్ గ్రా మం జల దిగ్బంధంలో చిక్కుకుంది. అలాగే నందిగామ నుండి బినోల వెళ్లే రహదారిపై సైతం గోదావరి నీరు వెళ్లడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. మండలంలోని కోస్లీ, యంచలలో గోదావరి నీటి మట్టాన్ని తహసీల్దార్ వెంకట రమణ, ఎస్ఐలు తిరుపతి, యాదగిరి గౌడ్‌లు పరిశీలించారు. గోదావరి సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

● **అలుగు పారుతున్న చెరువులు**

మండలంలో 91 చెరువులు ఉండగా గురువారం సాయంత్రానికి 70శాతం చెరువులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. మరో రెండు రోజుల్లో మిలిగిన చెరువులు సైతం పూర్తిగా నిండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఉమ్మెడ గోదావరికి పెరిగిన వరద ఉధృతి

- ఉమా మహేశ్వర ఆలయానికి మరింత ముంపు
- చౌడమ్మ కొండూర్‌లో నీట మునిగిన వరి పొలాలు

నందిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ వర్షా కాలంలో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురిశాయి. బుధవారం 90 ఎం.ఎం వర్షాపాతం నమో దు కాగా గురువారం 156 ఎంఎం వర్షం మధ్యాహ్నం [illegible]నే కాకుండా ఎగువన ఉన్న మహరాష్ట్రలో అధిక వర్షాలు కురియడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. పెద్ద ఎత్తున వరద నీరు ఎస్ఆర్ఎస్‌పీకి చే రుతోంది. ఉమ్మెడ - పంచగుడి మధ్య ఉన్న బ్రిడ్జిని ఆనుకొని గోదావరి ప్రవహిస్తోంది. ఈ వరద ఉధృతికి ఉమా మహేశ్వర ఆలయానికి మరింత ప్ర మాదం పొంచి ఉంది. భారీ వర్షాల కారణంగా మండలంలోని చౌడమ్మ కొం డూర్, నందిపేట శివారులో పంట పొలాలు నీట మునిగాయి.


చౌడమ్మ కొండూర్‌లో మునిగిన వరి పొలాలు

నిజాంసాగర్‌కు భారీ వరద

- ప్రాజెక్టుకు ఉన్న మూడు చోట్ల వరద గేట్లను ఎత్తివేత
- రెండు లక్షల 20 వేల క్యూసెక్కుల వరద నీరు మంజీరా నదిలోకి
- బిక్కుబిక్కుమంటున్న గ్రామాల ప్రజలు
- ముంపునకు గురైన పంటల రైతులు ఆందోళన

నిజాంసాగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలమైంది. రహదారులన్నీ నీటమునిగాయి. రైతులు కష్టపడి సాగుచేసిన వారిపై వందలాది ఎకరాలు నీట మునిగాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తివేయడంతో అచ్చంపేట పెద్దరేపల్లి చిన్నారి పళ్లి, లింగంపల్లి, మరిపల్లి, గోరగాల్ మాగి. బంజపల్లి, సుల్తాన్ నగర్ గ్రామాల చుట్టూ వరద నీరు కమ్ముకుంది. ఈ గ్రామాల్లో వందనాలు ఎకరాల వరిపై నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతూ ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు మూడు చోట్ల ఉన్న 48 గేట్లు నుంచి 27 వరద గేటును ఎత్తి రెండు లక్షల 20 వేల 256 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మంజీరాలోనికి విడుదల చేస్తున్నారు. మంజీరా ఉపనది వెంట ఉన్న నల్లవాగు ముట్టడి పొంగిపొర్లుతూ ఉండడంతో వరద నీరంతా గ్రామాలను కమ్ముకొని ఉన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని మర్పల్లి గ్రామ ప్రజలను ముందస్తుగా అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. మంజీరా నది భారీ పరవాళ్ళు తొక్కుతూ ఉండడంతో మంజీరా నిది వెంట ఉన్న గ్రామాలైన బ్రాహ్మణపల్లి, ఆరేపల్లి, అచ్చంపేట, మర్పల్లి, మాగి. గోర్గల్ బంజపల్లి సుల్తాన్ నగర్ గ్రామాల సాగు భూముల్లో వేసిన వరిపైరు లా పైనుంచి వరద నీరు పరవళ్ళు తొక్కుతూ ఉండడంతో రైతులు ఆందోళన చేస్తూ ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను 27 ఎత్తడంతో వరద నీరు నవోదయ రాకపోకలు స్తంభించిపోయాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతం నుండి భారీ వరదలు వస్తూ ఉండడంతో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణలో అధికారులు వరదనీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ గేట్లను ఎత్తి దిగువకు నీటినివదిలి వేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1405 అడుగుల గాను 1404.33 అడుగుల నీటి సామర్థ్యాన్ని అధికారులు నిల్వచేస్తున్న ప్రస్తుతం నిజాంసాగర్‌లోనికి రెండు లక్షల 8 వేల 201 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. నిజాంసాగర్‌లో 17.802 టీఎంసీలకు గాను 16.776 నీటి సామర్థ్యాన్ని విలువ చేస్తూ ఉన్నారు. నిజాంసాగర్ నుండి మల్లూరు కురాకపోకలు నిలిచిపోయాయి. చాప చెరువు పలుగు ద్వారా వారి వరద నీరు వస్తూ ఉండడంతో వడ్డేపల్లి శివారులోని వరి పైరు తాకిడికి గురి అయింది. నిజాంసాగర్ ప్రాజెక్టులను 36 ఏళ్ల విరామం తర్వాత అధికారులు ఏడాది ఎత్తివేయడంతో భారీ వర వరద నీరు మంజీరా నదిలోనికి పరవళ్ళు తొక్కు ఉండడంతో గ్రామాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి వరద గేట్లను తిలకిస్తున్నారు.


ప్రాజెక్టు 8 గేట్లు ఎత్తివేసిన దృశ్యం


పొంగిపొర్లుతున్న నల్లవాగు మత్తడి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో

మన పాఠశాల-మన ఆత్మ గౌరవం
పోస్టర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మన పాఠశాల-మన ఆత్మగౌరవం పోస్టర్లను డీఈవో అశోక్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్, తపస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మన పాఠశాల - మన ఆత్మగౌరవం పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. దేశం పట్ల భక్తిని పాఠశాల ఆస్తులను తమ సొంత ఆస్తులుగా భావించి విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా 15లక్షల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి భద్రినాథ్ తెలిపారు. తపస్ ఆధ్వర్యంలో ఇందూరు జిల్లాలో 700 పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అంబటి నర్సయ్య, జక్రాన్‌పల్లి అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్, హాకీ టోర్నమెంట్ రద్దు

సుభాష్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జరగాల్సిన బాస్కెట్ బాల్, హాకీ టోర్నమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి పవన్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టోర్నమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే డీఎస్‌ఏ మైదానంలో నీరు నిలిచి ఉండటంతో క్రీడాకారులకు ఇబ్బందులు ఎదురవుతాయని క్రీడా పోటీలను రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళులు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వామపక్ష పార్టీలు చేసిన ఉద్యమంలో అసువులు బారిన అమరవీరులకు వామపక్ష పార్టీలు నివాళులర్పించాయి. గురువారం నిర్వహించిన సంస్మరణ సభలో వామపక్ష పార్టీ నాయకులు అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాడు కాల్పుల్లో రామకృష్ణ, బాలకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు అసువులు బాసారని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఐఎంఎల్ మాస్ లైన్ నగర కార్యదర్శి సుధాకర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు మల్లికార్జున్ నివాళులర్పించారు. వామపక్ష నాయకులు ఓమయ్య, రఘురాం, నూర్జహాన్, రాములు, అనిత రాజు, శివకుమార్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి శవపేటిక ఫ్రీజర్ అందజేత

డిచ్‌పల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నడిపల్లి సచివాలయానికి 60వేల రూపాయల విలువ చేసే శవపేటిక ఫ్రీజర్ ను ఆర్యవైశ్య వాసవి యూత్ సభ్యులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. సామాజిక సేవ చేయడం తమకెంతో ఆనందంగా ఉందని ఆర్య వైశ్య యూత్ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో గంగాధర్, మాజీ సర్పంచ్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గన్నారం సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఈ


ఇందల్వాయి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఇందల్వాయి మండలంలోని గన్నారం ఉపకేంద్రంలోనికి భారీ వరద వచ్చిన కారణంగా గన్నారం ఉపకేంద్రాన్ని, 220/132/33 కేవీ డిచ్‌పల్లి ఉపకేంద్రాన్ని ఎస్ఈ రవీందర్ గురువారం పరిశీలించారు. వినియోగదారులకు కరెంట్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట నిజామాబాద్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రవీందర్, డిచ్‌పల్లి డివిజనల్ ఇంజనీర్ రమేష్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్, ఏఈ బర్దిపూర్ రాజేందర్, ఏఈ డిచ్‌పల్లి గంగారాం ఉన్నారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన


డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):నగరంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమీషనర్ దిలీప్ కుమార్ పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి నగరంలోని రైల్వే కమాన్, గౌతంనగర్, బోధన్‌రోడ్, సాగర్‌హిల్స్, తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలను పరిశీలించి ఎప్పటికప్పుడు డ్రైనేజీలను తీసివేయాలని రోడ్లపైన నీరు నిలువ ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కమీషనర్ వెంట డిప్యూటీ కమీషనర్ రవిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బద్దంవాడలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. చెక్కులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఏఎంసీ డైరెక్టర్ మహిపాల్, కాంగ్రెస్ నాయకులు గిర్మాజి గంగాధర్, చొక్కాయి గంగారెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి సస్పెన్షన్

మోస్రా,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పార్టీ సిద్ధాంతాలు పాటించని ఏ నాయకుడు అయినా పార్టీ ఆదేశాల ప్రకారం తొలగిస్తారని కాంగ్రెస్ పార్టీ మోస్రా మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ అన్నారు. గురువారం నాడు మోస్రా గ్రామ అధ్యక్షుడు పిట్ల హరీష్ పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని గ్రామ అధ్యక్ష పదవి తొలగిస్తూ పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మండల ఎస్సీ ఎల్, బీసీసెల్, కిసాన్ ఖేత్ అధ్యక్షుడు ఉన్నారని లక్ష్మణ్ తెలిపారు.

వాన జోరు.. వరద హోరు..

(5వ పేజీ తరువాయి)

రాకపోకలు డొంకల్ శివారులో వరద నీటిలో చిక్కుకున్న రైతును పోలీసులు, గ్రామస్థులు కలిసి కాపాడారు. భీంగల్ శివారులోని కప్పలవాగు సమీపంలో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరద నీటితో నిండిపోగా అందులో పనిచేస్తున్న సిబ్బందిని గజ ఈత గాళ్ల సహాయంతో రక్షించారు.

12,413 ఎకరాల్లో పంట నష్టం

గత 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 8.9 సెంటీమీటర్ల వర్షం నమోదు కాగా అత్యధికంగా సిరికొండ మండలం తూంపల్లిలో 27.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల వల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 12,413 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. 79 గ్రామాలలో పంట నష్టం జరిగింది. 6706 రైతులు పంటనష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు.

అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ అర్వింద్

భారీ వర్షాల వల్ల జిల్లా పరిస్థితిపై ఎంపీ అర్వింద్ జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్యలతో ఆయన ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షప్రభావం తీవ్రంగా ఉందని పలు గ్రామాలు నీటమునిగాయని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విపత్తు నిరహణపై హోంశాఖకు సైతం నివేదిస్తానని ఆయన తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

గోదావరి లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ లోతట్టు ప్రాంతాల్లో అవసరమున్న ప్రజలకు సహాయ సహకారాలు అందించాలన్నారు.

నిండిన చెరువులు..

జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువులు జలమయమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 318 చెరువులు పూర్తిస్థాయిలో నిండినట్లు అధికారులు తెలిపారు. మరో 391 చెరువులు 75 నుంచి 100 శాతం నిండగా, మరో 173 చెరువులు 50 నుంచి 75 శాతం నిండినట్లు అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు భారీ వరద...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో అధికారులు 39 గేట్లను ఎత్తారు. ప్రాజెక్టులోకి 3లక్షల 90వేల ఇన్‌ఫ్లో వస్తుండగా, 39 గేట్లతో పాటు వరద గేట్ల ద్వారా 3లక్షల 81వేల 412 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 67టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 81 టీఎంసీలు కాగా వరద ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉంది. అధికారులు ముందుజాగ్రత్తగా గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

బీభత్సం సృష్టించిన వర్షం


గడ్కోల్లో పంటలను పరిశీలిస్తున్న తాహెర్‌బిన్


నీట మునిగిన డిచ్‌పల్లి రైల్వే ట్రాక్

సిరికొండ/సుభాష్‌నగర్/డిచ్‌పల్లి/మోపాల్,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. తూంపల్లిలో 28 సెం.మీ. చీమన్‌పల్లిలో 12 సెం.మీ. సిరికొండలో ఎనిమిది సెం.మీ. వర్షపాతం నమోదయింది. కప్పల వాగు, మొండివాగు పొంగిపొర్లాయి. ధర్పల్లి మండలం హొన్నాపేట్ గ్రామ పరిధిలోని ముత్యాలవాగు ప్రాజెక్టు తెగిపోవడం మూలంగా మండలంలోని కొండూర్,పెద్దవాల్గోట్,చిన్నావాల్గోట్, పోత్నూర్ గ్రామలపై ప్రభావం చూపింది. కొండూర్ వద్ద రెండు వాగులు కలిసి పారాయి. కొండూర్ వద్దగల వంతెన తెగిపోయింది. కొండూర్ , పెద్దవాల్గోట్ గ్రామాల్లో వరద నీళ్లు ఇళ్లను ముంచెత్తాయి. తూంపల్లి, గడ్కోల్, రామడుగు, కొండూర్, పెద్దవాల్గోట్, చిన్నావాల్గోట్, పోత్నూర్ గ్రామాల్లో పొలాల్లో ఇసుకమేట వేసింది. గడ్డమీది తండా-కొండపూర్ గ్రామాల మధ్య రెండు వంతెనల వద్ద అప్రోచ్ రోడ్డు కోతకు గురై రాకోకలు నిలిచిపోయాయి. తూంపల్లి -కొండపూర్ మధ్యలో రోడ్డు కోతకు గురయ్యి రాకపోకలు నిలిచి పోయాయి. సిరికొండ వద్ద దోన్లవాగు, నార్సింగ్‌పల్లి వద్ద వాగులు పొంగి భీమ్‌గల్-సిరికొండ మధ్యలో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. కామధేను కళా శాల పరిసర ప్రాంతంలోని కాలనీలోకి, ముషీర్‌నగర్ గ్రామంలోకి వరద చేరింది. కప్పల వాగు వరద ప్రవాహం వల్ల ఇళ్లు నీట మునిగిన కుటుంబాలకు కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రొక్కం సంపత్‌రెడ్డి భోజనాలు ఏర్పాటు చేశారు. దెబ్బతిన్న పంటలకు ప్రభు త్వం నుంచి పరిహారం ఇప్పిస్తామని రాష్ట్ర ఉర్దు అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ హామీ ఇచ్చారు. మండలంలోని కొండపూర్‌లో మంగళి లింబవ్వ అనే ఒంటరి మహిళ ఇల్లు కూలిపోయింది. నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద వర్షం నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం నీరు ఎక్కువై రోడ్డుపైన ప్రవహించడంతో అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్, మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ రవిబాబు, ఆర్ఐ వినోద్, ట్రాఫిక్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ట్రాఫిక్ క్రేన్ సహాయంతో మ్యాన్‌హోల్ ఓపెన్ చేసి వర్షం నీటిని మ్యాన్‌హోల్‌లోకి వెళ్లే విధంగా చేయడంతో కోర్టు చౌరస్తా వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు డ్రైనేజీలోకి వెళ్లిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది జోరుగా కురిసిన వర్షంలోనే నీరు నిలువకుండా చేసిన పనిని అక్కడున్న ప్రజలు అభినందించారు.

బర్దిపూర్‌లోని కోనం చెరువు గత రెండు రోజులుగా భారీ వర్షాలతో పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఎగువ నుంచి వస్తున్న నీరు చెరువు పక్కనగల బర్దిపూర్ గోసంగి కాలనీ, ధర్మారం(బి)లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 25 కుటుంబాలను ఇళ్లలోకి నీరు చేరడంతో బంర్దిపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తులతో కలిసి నీరడి పద్మారావు ఆధ్వర్యంలో గోసంగి కాలనీవాసులను ముందస్తుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రానికి తరలించారు. అంతేకాకుండా ధర్మారం(బి) కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో 20 కుటుంబాలను ముందస్తుగా నివాసపు ఇళ్లకు నీరు చేరడంతో ధర్మారం(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రానికి వారిని తరలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డిచ్‌పల్లిలో భారీ వర్షం

డిచ్‌పల్లి మండలంలో గత రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఘన్‌పూర్ చెరువు పూర్తిస్థాయిలో నిండిపోయి అలుగు పారుతుండగా ఖిల్లాడిచ్‌పల్లి చెరువు 90 శాతం నిండింది. అంతేకాకుండా డిచ్‌పల్లి స్టేషన్‌లోని రాజరాజేశ్వర చెరువు సమృద్ధిగా నీరు చేరింది. బర్దిపూర్ కోనం చెరువు కూడా ప్రమాదస్థాయి నుంచి వరద పారుతుంది. రామడుగు ప్రాజెక్టు కింద గల సుద్దులం గ్రామ వాగులను కొరట్‌పల్లి మైలారం వాగులను, వంతెనలను తహశీల్దార్ సతీష్‌రెడ్డి,ఎండీవోరాజ్‌వీర్,ఎంఆర్ఐ సంతోష్‌లు పరిశీలించి ఆ ప్రాంత రైతులకు, ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిచ్‌పల్లి స్టేషన్‌లో ఎస్‌పీఆర్ కళాశాల పక్కన గల పంట పొలాల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. డిచ్‌పల్లి, నిజామాబాద్ రహదారిపై వర్షం దాటికి రాకపోకలు స్థంభించాయి. ఖిల్లా డిచ్‌పల్లి గ్రామం లో వర్షం దాటికి గ్రామానికి చెందిన నర్సయ్య పురాతన నివాసరపు ఇళ్లు కూలిపోవడంతో గ్రామస్తులు అధికారులు కుటుంబ సభ్యులకు జిల్లా పరిషత్ పాఠశాలలో పునరావాసం కల్పించారు. అంతేకాకుండా డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లోవర్షం దాటికి రైలు పట్టాలు పూర్తిగానీటిలో మునిగిపోయాయి. దీంతో రైల్లరాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురయ్యాయి.

మోపాల్‌లోభారీ వర్షాలతో నిజామాబాద్ రూరల్ మండలంలోని ముత్తకుంట, ఖానాపూర్ గ్రామాలకు వెళ్లకుండా వరదనీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో గ్రామీణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల ప్రజలు స్వగ్రామానికి రహదారులను మండలస్థాయి అధికారులు, పోలీసులు మూసివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం నీరు పెద్ద ఎత్తున ఈ రోడ్లపై ప్రవహించడంతో ముందు జాగ్రత్తగా అధికారులు ఈ రహదారులను మూసి ఉంచారు. పాంగ్రా గ్రామ శివారులోని వాగు వద్ద నివసిస్తున్న పేదలను రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాతనే తమ తమ ఇండ్లలోకి వెళ్లాలని ప్రజలకు సూచించారు. అత్యవసర సమయంలోనే ఇంటి నుంచి బయటకు రావాలి తప్ప అనవసరంగా బయటకు రావద్దని రూరల్ ప్రజలకు అధికారులు సూచనలు జారీ చేశారు.

కుండపోత వర్షం

గత రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మోపాల్ మండలంలోని మంచిప్ప, కులాస్‌పూర్, మాసాని, ఖజానా చెరువు, కొండెం చెరువులతో పాటు ఆయా గ్రామాల్లోని చిన్న చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో రెండు కూనిండ్లు భారీ వర్షంతో కూలిపోయాయి. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు గ్రామాలను తిరుగుతూ ప్రజలను కోరుతున్నారు. గ్రామాల్లో ఉన్న చెరువులు తెగిపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులు గ్రామాల్లోని చెరువులను గురువారం పర్యవేక్షించారు. మండల తహశీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో రాములు నాయక్, ఎస్సై సుశ్మిత, ఆర్ఐ రాజేశ్వర్‌లు గ్రామాలను తిరుగుతున్నారు. మంచిప్ప చెరువు నిండి అలుగు పారుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు వెళ్లి పరిశీలిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల తర్వాత ఇంత పెద్ద ఎత్తున వర్షం పడటంతో గ్రామాల్లోని చెరువులు, కుంటలన్నీ నిండిపోయాయని గ్రామీణ ప్రజలు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. కూనిండ్లలో నివసిస్తున్న ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. పూర్తిగా శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

ఆలూర్ లో భారీ వర్షాలు

ఆలూర్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రం, పరిసరా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండల అధికారులు ఎంఆర్ఓ రమేష్, ఎంపీడీవో గంగాధర్‌లు ఈ వర్షాలు నేపథ్యంలో లెవెల్ వంతెనలు, రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీటి వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

బషీరాబాద్ ఐటీఐలో
అడ్మిషన్ల గడువు పొడిగింపు

కమ్మర్‌పల్లి,ఆగస్టు 28:(ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను వాక్‌ఇన్ (స్పాట్)అడ్మిషన్ల తేదీ పొడగింపు ఈనెలా ఖరువరకు(30-8-2025) పొడగించినట్లు బషీరాబాద్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కోటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషన్, డిజిల్ మెకానిక్ అధునాతన కోర్సులుఅయిన అడ్వాన్ ఎన్‌సీఎన్‌మెషినింగ్ టోక్నిషియన్ 176 సీట్లు ఖాలీలుగా ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థులు దరకాస్తులు చేసుకోవాలని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు, ఇంటర్ ఫేల్, పాసైన, అపైచదువులు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు అన్‌లైన్‌లో దరకాస్తులు చేసుకోవడా నికి వీకుదగ్గలో ఉన్న మీ సేవాకేంద్రలలో సంప్రదించాలన్నారు. మీయొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్‌చేసి వెబ్‌సైట్‌లో అప్లై చేయాలని అంతకుముందు ఎస్సెస్సీ మెమో ప్రకారం ఆధార్‌లో పుట్టినతేదీ సరిచూసు కోవాలన్నారు. కాగా మీ మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడి ఎధైతే వెబ్‌సైట్‌లో నమో దు చేస్తారో మోబైల్ నెంబర్ ఐటీఐ కోర్సు పూర్తిఅయ్యేవరకు ఉం డా లని ముబైల్ నెంబర్ మారిస్తే అడ్మీషన్ క్యాన్సల్ అవుతుంద న్నారు. 16 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు అర్హులని, కోర్సుల వివరాలు, విద్యార్హతలకు వెబ్‌సైట్ చూడాలన్నారు అదనపు సమాచారం కోసం 850066380 8106795400 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు


పూజలందుకుంటున్న గణపతులు

డిచ్‌పల్లి,ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాలతో పాటు కాశీవిశ్వనాథ ఆలయంలో సార్వజనిక గణేష్ మండలి సభ్యులు భారీ వినాయకుడిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మారం(బి) గ్రామంలో వెంకటేశ్వరాలయంలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అంతేకాకుండా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు, అధికారులు గణేష్ విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు చేసి గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సైలతో పాటు కానిస్టేబుల్లు పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్‌లో పూజలు చేస్తున్న పోలీసులు, అధికారులు

నీట మునిగిన శ్రీ చైతన్య పాఠశాల

- వర్షం నీటితో హాస్టల్ భవనం దిబ్బంధం
- విద్యార్థులను క్యాంపస్ కు తరలించిన అధికారులు


హాస్టల్ భవనంలోకి చేరిన నీరు

మోపాల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గూపన్‌పల్లి సమీపంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల భవనం గురువారం సాయంత్రం నీట మునిగింది. పూలంగు వాగు బఫర్ జోన్ లో స్కూల్ ఉండడంతో అక్కడే ఉన్న హాస్టల్ భవనం చుట్టూ నీట మునిగిపోయింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షంతో నీటి ప్రవాహం ఎక్కువైంది. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు పాఠశాల చేరుకొని పాఠశాలలో ఉన్న విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హాస్టల్ యజమాన్యంపై విద్యార్థులు తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఐర్లాండ్‌లో మెండోరా యువకుడి మృతి

- 4 నెలల క్రితం వివాహం చేసుకొని ఐర్లాండ్ వెళ్లిన యువకుడు
- గుండెపోటుతో మృతి ● కన్నీరు మున్నీరుగా కుటుంబ సభ్యులు


అన్వేష్‌రెడ్డి(ఫైల్)

మెండోర , ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సామ అన్వేష్‌రెడ్డి (30) ఐర్లాండ్‌లో గుండెపోటుతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మెండోర గ్రామానికి చెందిన సామ ము త్యవ్వ, శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారు లు పెద్ద కుమారుడు ఐర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు, చిన్న కుమారుడు అమెరికాలో ఉద్యో గం చేస్తున్నా డు. అన్వేష్ నాలుగు నెలల క్రితం ఐర్లాండ్ నుంచి వచ్చి వివాహం చేసుకు న్నాడు. వి వాహం చేసుకున్న నెల రోజులకే ఐర్లాండ్ వెళ్ళాడు. బుధవారం ఆఫీస్‌కి వెళ్లే ముందు గుండె పోటు రావడంతో తోటి స్నేహితులు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని స్థానికులు తెలిపారు. అందరితో కలిసి మెలసి ఉండే అన్వేష్‌రెడ్డి ఐర్లాండ్‌లో మృతి చెందిన విషయం తెలపగానే కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు కన్నీరు మున్నీరు అయ్యారు. ఐర్లాండ్ నుండి అన్వేష్‌రెడ్డి మృతదేహం రావడానికి ఐదు ఆరు రోజుల సమయం పట్టవచ్చని తెలిపారు.

కొలువుదీరిన గణనాథులు

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పర్వదినం

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో, మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. మండపాల్లో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో వినాయకుడికి ప్రతిష్ఠాపన పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. వినాయకుడి ఆలయాల్లో వేదమంత్రోచ్ఛరణలతో పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఉదయం ప్రారంభమైన పూజలు రాత్రి వరకు కొనసాగాయి. మండపాల్లో వినాయకులను మండప నిర్వాహకులు మేళతాళాలతో స్వాగతం పలికి ప్రతిష్ఠించారు. జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాలు మొదలుకొని నగరంలోని వీధులలో చిన్న వినాయకుడు మొదలు కొని భారీ వినాయకులను ప్రతిష్ఠించారు.

● ప్రత్యేకతలతో వినాయకుని ప్రతిష్ఠ

ప్రతియేటా ప్రత్యేక ఆకర్షణ నిలిచే విధంగా వినాయకులను తయారు చేయించి ప్రతిష్ఠించడం పలు మండప నిర్వాహకులు ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ జిల్లా కేంద్రంలోని బురుడుగల్లిలో రవీంద్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో పసుపు కొమ్ములతో తయారు చేసిన గణపతి కొలువుదీరగా, వర్ని చౌరస్తా వద్ద భక్త హిందు యూత్ ఆధ్వర్యంలో బస్మఉండలతో వినాయకుడిని తయారు చేసి ప్రతిష్ఠించారు. అదే విధంగా పోచమ్మగల్లిలో రవితేజ యూత్ ఆధ్వర్యంలో 56 అడుగుల విగ్రహాన్ని తయారు చేసి పూజించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అహల్యాదేవి ఇతివృత్తంతో ఉన్న గణపతిని ప్రతిష్ఠించారు.

● కొలువుదీరిన భారీ విగ్రహాలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండపాల్లో భారీ విగ్రహాలు కొలువుదీరాయి.గతంలో పదుల సంఖ్యలో విగ్రహాలనుఏర్పాటు చేయగా ఈసారి వాటి సంఖ్య వందలకు చేరాయి.భారీవిగ్రహాలు ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకొని విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాలనుసర్వాంగసుందరంగా తీర్చిదిద్దిప్రతిష్ఠించిపూజలు చేశారు.

దొంగతనానికి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

ఆలూర్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం మిర్ధాపల్లిలో బుధవారం ఏలేటి చిన్న సాయిరెడ్డి భార్య వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లి అక్కడ పనిచేస్తుండగా జాదవ్ అనే వ్యక్తి ఆమెపై దాడిచేసి బంగారాం, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయగా ఆమెగా ప్రతిఘటించడంతో జాదవ్ తన వద్ద ఉన్న కత్తితో దాడిచేసి పారిపోవడానికి యత్నించాడు. గాయపడిన మహిళ తన భర్తకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకొని నింది తుడిని పట్టుకుని గ్రామంలో బందించారు. ఈ విషయమై పోలీస్‌లకు సమాచారం ఇవ్వడం తో వారు వచ్చి దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

సినిమా గైడ్


దేవి	: కొత్తలోక (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: కూలీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: బ్రహ్మండ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: సుందరకాండ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: బ్రహ్మండ (11.00, 10.30) : కొత్తలోక (1.30)
	: త్రిబణదారి బార్బరిక్ (4.30) : కూలీ (7.20)
స్క్రీన్-2	: కూలీ (1.30) : సుందరకాండ (4.40, 10.30)
	: కొత్తలోక (7.30)
స్క్రీన్-3	: కన్యాకుమారి (1.45)
	: మహావతార్ నరసింహ (4.30, 10.20)
	: త్రిబణదారి బార్బరిక్ (7.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: మహావతార నరసింహ (1.45, 4.35)
స్క్రీన్-2	: పరం సుందరి (హిందీ) (10.40, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3	: త్రిబణదారి బార్బరిక్ (11.35, 8.05)
	: కన్యాకుమారి (2.20)
	: సుందరకాండ (5.10, 10.50)
స్క్రీన్-4	: కేపీ అగ్రహారంలో అంబేద్కర్ (10.05)
	: అర్జున్ చక్రవర్తి (1.00)
	: కూలీ (3.45, 10.50)
	: వార్-2 (హిందీ) (7.15)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.103,200	రూ.95,400	రూ.1225

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.145	రూ.225	రూ. 245
వెన్‌కాబ్(కిలో)	రూ.150	రూ.230	రూ. 250

